క్లుప్తంగా

ఘనంగా పైడితల్లమ్మ పండగ



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: పురుషోత్తపురం గ్రామ దేవత పైడితల్లమ్మ వార్షిక పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. చీరలు, కానుకలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఏపీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, స్థానిక నాయకులు పిల్లా జగన్ మోహన్‌పాత్రుడు, చందుయాదవ్, చీర అప్పలరాజు, వందలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సింహాచల్‌నగర్‌లో బడిబాట



బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, ప్లకార్డులతో విద్యార్థులు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహాచల్ నగర్‌లోని ఎంపీపీ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లల్ని పాఠశాలలో చేర్పించాలని, పనికెందుకు తొందర-చదువుకో ముందర అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రభుత్వ బడి ప్రాధాన్యతను వివరించారు. అత్యంత నైపుణ్యం గల ఉపాధ్యాయులున్న ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొర్లివానిపాలేనికి ట్రాక్టర్ అందజేత



ట్రాక్టర్ పత్రాలను అందిస్తున్న లారస్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరావు

పరవాడ: లారస్ ల్యాబ్స్ సహకారంతో గొర్లివానిపాలెం గ్రామాభివృద్ధికి సమకూర్చిన ట్రాక్టర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహరావు కోరారు. లారస్ ల్యాబ్స్ ఆర్థిక సాయంతో సమకూర్చిన ట్రాక్టర్‌ను సర్పంచ్ గొర్లి గోపి అమ్ములుకు మంగళవారం అందించారు. గ్రామాభివృద్ధితోపాటు, గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి సహకరించిన లారస్ ల్యాబ్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి రామారావు, వార్డు సభ్యులు పోలిరెడ్డి అప్పారావు, పైల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి తరుణ, పోలిరెడ్డి వెంకటరావు, లారస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన పది మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.లక్ష జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. మంగళవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

పరవాడ: వెన్నెలపాలెంలో మరమ్మతులకు గురైన చేతిపంపుల(బోర్ల)కు ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు పర్యవేక్షణలో మంగళవారం మరమ్మతులు చేపట్టారు. వేసవి నీటి ఎద్దడి నివారణలో భాగంగా తాగునీటి సరఫరా విభాగం చర్యలు చేపట్టింది. పనిచేయని బోర్లను గుర్తించి, బాగు చేశారు. ఇందుకు అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజులకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మరమ్మతుల సమయంలో బండారు సతీష్, వెంకటరమణ, నారాయణమూర్తి, అప్పలకొండ సహకారం అందించారు.

వేటకు బ్రేక్

బతుకు తెరువుపై గంగపుత్రుల్లో బెంగ

- వేట నిషేధం అమలుతో తీరంలో లంగరేసిన బోట్లు
- రెండు మాసాలు ప్రత్యామ్నాయ కూలిపనులే దిక్కు
- గతేడాది మత్స్యకార భరోసా ఇప్పటికీ అందని వైనం





వేట సాగితే గానీ పూట గడవని గంగపుత్రులకు చేపల వేట విరామ సమయం రానే వచ్చేసింది. దీంతో వారి బతుకుల్లో అందోళన మొదలైంది. గతేడాది వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందిస్తానన్న మత్స్యకార భరోసా ఆర్థిక సాయం ఇంత వరకు అందనేలేదు. ఇప్పుడు రెండో ఏడాది వేట నిషేధం అమల్లోకి వచ్చింది. దీంతో ఈ రెండు మాసాలు తమ బతుకుల్ని ఎలా నెట్టుకురావాలో తెలియక, మత్స్యకారులు సతమతమవుతున్నారు.

పరవాడ:

ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి వేట నిషేధం అమల్లోకి వచ్చింది. జూన్ 15 వరకు మెకనైజ్డ్, మోటార్ బోట్లతో మత్స్యవేట సాగించడం చట్టరీత్యా నేరం. 61 రోజులపాటు గంగపుత్రులు చేపల వేటకు దూరంగా ఉండాలి. ఈ రెండు మాసాలు కుటుంబ పోషణపై మండలంలోని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలరిపేట గ్రామాల గంగపుత్రుల్లో ఆందోళన నెలకొంది. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా.. చేపల జాడ గురించి ఏ చిన్న సమాచారం అందినా బోట్లపై సముద్రంలోకి ఉరకలెత్తే మత్స్యకారులు వేట నిషేధ సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కోవాల్సిందే. ఆసరాగా నిలిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొండి చేయి చూపడంతో.. వీరిలో ఆందోళన మరింతగా పెరిగింది.

కూలి పనులకు వెళ్లాల్సిందే!

సముద్రంలో చేపల పునరుత్పత్తికి భంగం కలగకుండా ఈ సీజన్లో మత్స్యవేటపై నిషేధం అమలు చేస్తున్నారు. ఈ సమయంలో మెకనైజ్డ్, మోటార్ బోట్లపై వేట సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. సంప్రదాయ మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా తెరచాప బోట్లపై తీరానికి సమీపంలో వేట సాగించవచ్చు. మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో సుమారు పది వేల మంది జనాభా ఉండగా, వారిలో వెయ్యి మంది వరకు సముద్రంపై చేపల వేట సాగిస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. చిన్న తెప్పలపై ఆరుగురు, కాస్త పెద్ద ఫైబర్ తెప్పలపై 8 మంది వరకు చేపల వేటకు వెళ్తుంటారు. ఇలా ప్రతి రోజు చేపల జాడ ఉందని సమాచారం అందగానే పరుగున సముద్రంపై వేటకు వెళ్లి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. అదృష్టం బాగుండి చేపలు చిక్కితే నాలుగు డబ్బులు కళ్ల చూస్తారు. లేకుంటే నిరాశతో వెనుదిరగడమే. ఈ రెండు మాసాలు అది కూడా లేకపోవడంతో తమకు పెద్దగా చేతకాని కూలి పనులకు వెళ్లి, కుటుంబ పోషణకు కష్టపడాల్సిందే.

అప్పులు చేయక తప్పని స్థితి

సముద్రంలో కలుస్తున్న ఫార్మా వ్యర్థ రసాయనాలు, ఎన్టీపీసీ వ్యర్థాలు సముద్ర జలాల్లో కలవడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని గంగపుత్రులు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు విడుదల చేస్తున్న విష రసాయనాలతో చేపలు మరణించి, తమకు ఉపాధి లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు.

ఈ మధ్య కాలంలో వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల వల్ల కూడా చేపల వేట ఆశించినంతగా లేక పూట గడవడం కష్టంగా ఉందని వాపోతున్నారు. తిండి గింజలు కొనుక్కోవడానికీ ఇబ్బందులు పడే పరిస్థితి. వేట నిషేధం అమల్లో ఉన్న రెండు నెలల పాటు కుటుంబ పోషణకు అప్పులే ఆధారమవుతున్నాయని గంగపుత్రులు వాపోతున్నారు.



ముత్యాలమ్మపాలెం తీరంలో ఒడ్డుకు చేరిన తెప్పలు

కూటమి ప్రభుత్వంలో దక్కని భరోసా

గత ఏడాది చేపల వేట నిషేధ సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచి అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటి వరకూ అమలుకాకపోవడంతో మత్స్యకారులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రెండో విడత నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సాయం కోసం ఇంకెంత కాలం ఎదురుచూడాలోనని గంగపుత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిషేధ సమయం అమల్లోకి రావడంతో తమ బోట్లు, తెప్పలు, వలలు, ఇంజన్లను సురక్షిత ప్రదేశాలకు తరలించి భద్రపరుచుకోవడం, మరమ్మతులు చేపట్టే పనిలో గంగపుత్రులు నిమగ్నమయ్యారు.

పూట గడవడం కష్టం



చేపల వేట నిషేధ సమయంలో కుటుంబాన్ని పోషించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఇస్తుందన్న మత్స్యకార భరోసా రూ.20 వేల కోసం గతేడాదంతా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశాం. ఇంతవరకు అందలేదు. సరికదా మళ్లీ రెండో విడత నిషేధ సమయం వచ్చేసింది. వేట లేకుండా రెండు నెలలు కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.
– మైలపల్లి పోలయ్య, మత్స్యకార్మికుడు

కూలి పనులే దిక్కు



మా కుటుంబ పోషణకు ప్రధాన ఆధారం సముద్రంలో చేపల వేట. చేపల వేట నిషేధ సమయంలో జీడి తోటల్లో దొరికే కూలి పనులపై ఆధారపడుతుంటా. ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక భరోసా సాయం గతేడాది కూడా రాలేదు. అప్పుడిస్తారు.. ఇప్పుడిస్తారు.. అంటూ ఆశ పెట్టారు తప్ప, ఎవరికీ పైసా కూడా ఇవ్వలేదు. మా ఇబ్బందుల్ని గుర్తించి మత్స్యకార భరోసా వెంటనే ఇవ్వాలి.
– వంక కృష్ణ, ముత్యాలమ్మపాలెం

'భరోసా'ఆదేశాలు రాలేదు



ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో 162 బోట్లు ఉన్నాయి. వీటి సాయంతో సముద్రంపై చేపల వేట సాగించే మత్స్యకారులు 1035 మంది ఉన్నారు. మత్స్యకార భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే గ్రామాల్లో సర్వే నిర్వహించి నివేదిక రూపొందిస్తాం. నిషేధ సమయంలో ఇంజన్ బోట్లతో చేపల వేట సాగించడం చట్టవిరుద్ధం.
– డాక్టర్ ఎస్.ఎం.కృష్ణ, మత్స్యకార్మిక శాఖ సహాయ అధికారి

సంతబయలులో పట్టపగలే చోరీ

- 8 తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు, నగదు అపహరణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: వారపు సంత జనసంచారంతో రద్దీగా ఉండే పరవాడ సంతబయలు ప్రాంతంలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లాలం రమణమ్మ ఇంట్లోని చెక్క పెట్టెలో దాచిన 8 తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదును దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సంత బయలు ప్రాంతంలోని ఆర్ఈసీఎస్ కార్యాలయానికి అతి సమీపంలో లాలం రమణమ్మ కుటుంబంతో నివసిస్తోంది. ఆమె నివాసానికి అతి సమీపంలోనే మంగళవారం వారపు సంత సాగుతుంది. సంతకు వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రమణమ్మ ఉదయం 6 గంటల సమయంలో ఓ టిఫిన్ షాపులో విధులకు వెళ్లి తిరిగి 10 గంటలకు ఇంటికి వచ్చింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి, లోపలకు వెళ్లి చూడగా చెక్క పెట్టె పెకలించి, బంగారం, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు తెలుసుకుంది. దీంతో లబోదిబోమంటూ పరవాడ పోలీసులను ఆశ్రయించింది. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చోరీ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. ఘటనా స్థలికి చేరుకున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ బాధితురాలి నుంచి పూర్తి వివరాలు రాబట్టారు. క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. బాధితురాలి ఇంటి ఆనుపానులు తెలిసివారే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ పేర్కొన్నారు.

అనుమతుల్లేని బాణసంచా తయారీపై చర్యలు



గుల్లేపల్లిలో దాసరి పెంటయ్యకు చెందిన బాణసంచా కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సబ్బవరం: అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన తీవ్ర విషాదం నేపథ్యంలో మండలంలోని పలు బాణసంచా తయారీ కేంద్రాలను సీఐ పిన్నింటి రమణ, అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజుతో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అంతకాపల్లి, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, గంగవరం గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలతో పాటు, వారి నివాసాల్లో కూడా విస్తృత సోదాలు చేశారు. గుల్లేపల్లిలోని దాసరి పెంటయ్య ఇంట్లో నిల్వచేసిన జువ్వల తయారీకి వినియోగించే పుల్లలను తగలబెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో తాత్కాలిక కోర్టు అనుమతులతో నాలుగు బాణసంచా తయారీ కేంద్రాలు నడుస్తున్నాయని, అయితే ప్రభుత్వ ఆదేశాలతో ప్రస్తుతం ఆ అనుమతులు కూడా రద్దయినట్లు పేర్కొన్నారు. ఇకపై ఎటువంటి బాణసంచా తయారు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాణసంచా తయారీ కేంద్రాల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, వీఆర్వోలు, అగ్నిమాపక సిబ్బంది రుక్మిణి, ముత్యాలనాయుడు, భూషణం, బెన్వర్ తదితరులు పాల్గొన్నారు.

'జియాన్' మాల్ ప్రాక్టీస్‌పై సమగ్ర దర్యాప్తు

- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం
- వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వితేజ స్పష్టీకరణ



జియాన్ టెక్నాలజీస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ పృథ్వితేజ, సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: చినముషిడివాడలోని జియాన్ టెక్నాలజీస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్) సూపర్‌వైజర్ ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగాలకు జరిగిన పరీక్షలో మాల్‌ప్రాక్టీస్ వ్యవహారాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఏటీ పృథ్వితేజ అన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన, సహకరించిన నిందితులెవరినీ విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. భెల్ పరీక్ష మాల్ ప్రాక్టీస్ వ్యవహారంలో కేసు నమోదు చేసిన నేపథ్యంలో మంగళవారం పరీక్ష కేంద్రాన్ని ఏసీపీ సందర్శించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తీరును పరిశీలించారు. నిర్వాహకులను విచారించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏ పోటీ పరీక్ష అయినా ప్రతిభతో ముందుకు వెళ్లాలి కానీ.. దొడ్డిదారిలో ఉత్తీర్ణత సాధించాలనుకోవడం సరికాదన్నారు. విద్యార్థులు/అభ్యర్థులు నైతిక విలువలు పాటించాలని సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ చేస్తే ఇతర అభ్యర్థులు నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏసీపీ వెంట పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



సబ్బవరం మూడురోడ్ల కూడలిలో మంటలను అదుపుచేసే విన్యాసాల్లో ఫైర్ సిబ్బంది

సబ్బవరం: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నియంత్రించవచ్చని సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక మూడు రోడ్ల కూడలిలో అగ్నిప్రమాదాల నియంత్రణపై స్థానిక ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక శకటం ద్వారా మంటలను అదుపు చేసే విన్యాసాలను ప్రదర్శించారు. ప్రమాద సమయంలో ఎలా వ్యవహరించాలో కూలంకషంగా వివరించారు. అనంతరం అగ్నిప్రమాదాల నియంత్రణపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సత్యరాజుతో పాటు లీడింగ్ ఫైర్‌మెన్ కె.అప్పలనాయుడు, సిబ్బంది ఎం.శ్యామ్ కుమార్, వి.ద్వారకాద్రి, సీహెచ్ బెన్‌హర్, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

'మైదానానికి మమ్మల్ని దూరం చేయొద్దు'



సింహపురి కాలనీ మ్యాప్ పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



సమస్యను పరిష్కరించాలని కోరుతున్న సింహపురి కాలనీవాసులు

సింహాచలం: కాలనీ ఏర్పడిన నాటి నుంచి క్రీడా మైదానంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని ఇతర అవసరాలకు కేటాయించొద్దంటూ వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌ను 98వ వార్డు పరిధి సింహపురికాలనీ యువత, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం ఆయన్ని కలిసి తమ అభ్యంతరాలను విన్నవించారు. కాలనీలో కొన్నేళ్లుగా క్రీడా స్థలంగా వినియోగించుకుంటున్న ఈ స్థలాన్ని ఇటీవల పెందుర్తి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకి ఉడా కేటాయించింది. ఈ నేపథ్యంలోనే కాలనీవాసులు విశ్వనాథన్‌ను కలిశారు. దీంతో ఆయన సింహపురికాలనీకి విచ్చేసి, సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ రామేశ్వరన్, సింహపురికాలనీ అసోసియేషన్ నాయకులు, యువత కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. కాలనీ ఏర్పడి 30 ఏళ్లు దాటిందని, అప్పటి నుంచి ఇక్కడ ఉన్న స్థలాన్ని క్రీడా మైదానంగా ఉపయోగించుకుంటున్నట్లు వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ఈ స్థలాన్ని మంజూరుచేసినట్లు డీఎఫ్‌వో తెలిపారు. కాలనీలోని పలు ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, కాలనీ యువత క్రీడలు ఆడుకునేందుకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సింహపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి, అధ్యక్షుడు కామేశ్వరరావు, కార్యదర్శి మురళీబాబు, మాజీ కార్యదర్శి నడింపల్లి రామరాజు, రామాలయ కమిటీ అధ్యక్షుడు చిరంజీవిరావు, కార్యదర్శి సిరికి అప్పలనాయుడు, కాలనీ యూత్ యశ్వంత్, మనోహర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

మండు వేసవిలో అకాల వర్షం ముంచెత్తింది. పెందుర్తిని తడిపేసింది. మంగళవారం మధ్యాహ్నం వరకు భానుడు నిప్పులు కురిపించగా.. సాయంత్రానికి వరుణుడు వాతావరణాన్ని పూర్తిగా చల్లబరిచాడు. కాసేపు కురిసిన వర్షానికే రోడ్లు నీటితో నిండిపోయాయి. మరోవైపు జీడి, మామిడి తోటలు పక్వానికి వస్తున్న దశలో అకాల వర్షంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే రాత్రికి వరుణుడు శాంతించడంతో మామిడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



పెందుర్తి ప్రాంతంలో గాలులు, వర్షం



రోడ్లపై చేరిన వర్షపు నీరు

ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న ఎంఈవో సువర్ణ

పెందుర్తి: స్థానిక దొగ్గవానిపాలెం రైల్వే గేటు సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల నడుమ జరిపారు. మండల విద్యాశాఖాధికారి-1 కె.సువర్ణ చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలు అందించారు. హెచ్ఎం ఎ.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల పండగ మహోత్సవాలు



పైడిమాంబ సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల, కూటమి నాయకులు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ, తాడి గ్రామంలో కొలువైన నూకాంబిక అమ్మవారి పండగలను ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పైడిమాంబను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు దర్శించుకుని, పూజలు చేశారు. కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, వియ్యపు చిన్న, బలిరెడ్డి అప్పారావు, కేఎస్ఆర్, బుగిడి రామగోవిందరావు, సుందరపు శ్రీనివాస్, చలపరెడ్డి రామారావు, జి.అచ్చిబాబులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పురవీధుల్లో ఊరేగించి, భారీ బాణసంచా వెలుగుల నడుమ అమ్మవార్ల అనుపు మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు.